సాక్షి సిద్దిపేట


శుక్రవారం, 9, ఆగస్టు, 2024



వృద్ధురాలి దారుణ హత్య

నగదుతో పాటు బంగారు ఆభరణాల కోసం వృద్ధురాలిని దారుణంగా హతమార్చారు.

వివరాలు 8లో ▸



నాటుబాంబుల మోత

హుస్నాబాద్ మండలం ఉమ్మాపూర్ అడవిలో వన్య ప్రాణుల వేట యథేచ్ఛగా సాగుతోంది. వేటగాళ్లు నాటుబాంబులను అమర్చుతున్నారు.

వివరాలు 8లో ▸



నిర్లక్ష్యంగా ఉంటే సహించం

అధికారులు బాధ్యతగా, నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని ఆర్డీఓ రామ్మూర్తి సూచించారు. నిర్లక్ష్యం తగదన్నారు.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

నేడు నాగుల పంచమి

- ముస్తాబైన ఆలయాలు



జిల్లా కేంద్రంలోని కోటిపడగల సంతాన నాగదేవత ఆలయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): శ్రావణమాసంలో మొదటగా వచ్చే పంచమిని, నాగుల పంచమిగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. శుక్రవారం నాగుల పంచమి సందర్భంగా ఆలయాలను ముస్తాబు చేశారు. ప్రముఖ కోటిపడగల సంతాన నాగదేవత ఆలయంతో పాటుగా ఇతర ఆలయాలలోని పుట్టల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయాల నిర్వాహకులు చర్యలు తీసుకున్నారు.

ఎస్జీటీల సమస్యలు పరిష్కరిస్తా



పీఆర్‌టీయూ సభ్యత్వాన్ని అందజేస్తున్న రఘోత్తంరెడ్డి

గజ్వేల్: ఎస్జీటీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి అన్నారు. గురువారం గజ్వేల్‌లో నిర్వహించిన పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కీలకమైన ప్రాథమిక విద్యలో విశేష సేవలందిస్తున్న ఎస్జీటీల సమస్యలపై నిర్లక్ష్యం తగదన్నారు. 11జీఓను సవరించి ప్రాథమిక పాఠశాలల్లో ఎస్జీటీ పోస్టులను పదివేలకు పెంచి, బీఈడీ అర్హత కలిగిన వారికి పీఎస్‌హెచ్‌ఎంలుగా పదోన్నతులు కల్పించేలా ముఖ్యమంత్రిని కోరతామన్నారు. ఎక్కడా లేని విధంగా ఎల్‌ఎఫ్‌ఎల్ పోస్టులను సాధించిన ఘనత పీఆర్‌టీయూకే దక్కిందని చెప్పారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శశిధర్‌శర్మ, గజ్వేల్ మండల శాఖ అధ్యక్షుడు వేమారెడ్డి, ప్రధాన కార్యదర్శి తీగుళ్ల లింగం, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కనకరాజు, రాష్ట్ర కార్యదర్శులు శ్రీనివాసరావు, పోచయ్యగౌడ్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

డెంగీ కేసులు నమోదు

- దుంపలపల్లిలో హెల్త్‌క్యాంపు



వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్య బృందం

దుబ్బాక: దుబ్బాక పట్టణంలో, మున్సిపాలిటీ పరిధిలోని దుంపలపల్లిలో ఒకటి చొప్పున డెంగీ కేసులు నమోదయ్యాయని వైద్యాధికారులు నిర్ధారించారు. దుంపలపల్లిలో అధికారులు వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. నాలుగు రోజుల క్రితం చెల్లాపూర్‌కు చెందిన ఓ బాలికకు సైతం డెంగీ వచ్చి తీవ్ర అస్వస్థతకు గురైనట్లు సమాచారం. మున్సిపల్ కమిషనర్ రమేష్‌కుమార్, సిబ్బంది, తిమ్మాపూర్ పీహెచ్‌సీ వైద్య సిబ్బంది గురువారం దుంపలపల్లిలో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. వైద్య శిబిరం ఏర్పాటు చేసి జ్వరాలతో బాధపడుతున్న వారిని పరీక్షించి మందులు అందించారు. గ్రామంలో పర్యటించి డ్రైనేజీలను, పరిసరాలను శుభ్రం చేయించడంతో పాటు దోమల మందును పిచికారీ చేశారు. ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఇల్లందుల శ్రీనివాస్, తిమ్మాపూర్ పీహెచ్‌సీ సిబ్బంది తదితరులు ఉన్నారు.


ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు

- సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: ర్యాగింగ్‌కు పాల్పడటం నేరమని, ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ అనురాధ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తోటి విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయవద్దన్నారు. వ్యసనాలకు బానిసై విద్యార్థులు భవిష్యత్‌ను నాశనం చేసుకోకూడదని సూచించారు. ర్యాగింగ్‌కు పాల్పడితే డయల్ 100కు కాల్ చేయాలని సూచించారు.

కూలిన విద్యుత్ స్తంభాలు

- పొలాల్లో పరుగులు తీసిన రైతులు, కూలీలు
- ప్రాణాలతో బయటపడిన 17 మంది
- దుబ్బాకలో ఘటన



పొలాల్లో విరిగిపడిన విద్యుత్ స్తంభాలు

దుబ్బాక: పొలాల్లో విద్యుత్ స్తంభాలు ఒక్కసారిగా విరిగిపడ్డాయి. ఆ సమయంలో నాట్లు వేస్తున్న రైతులు, కూలీలు ఆందోళనకు గురై పరుగులు తీశారు. వారంతా ప్రాణాలతో బయటపడటంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ఘటన దుబ్బాక పట్టణ సమీపంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. స్థానిక మారెమ్మగుడి నుంచి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం (దుంపలపల్లి రోడ్డుకు) వెళ్లే బైపాస్ రోడ్డులోని వ్యవసాయ పొలాల్లో బుధవారం సాయంత్రం 3 విద్యుత్ స్తంభాలు ఒక్కసారిగా విరిగిపడ్డాయి. ఆ సమయంలో పొలాల్లో నాట్లు వేస్తున్న రైతులు, కూలీలు 17 మంది అదృష్టవశాత్తు ప్రాణాలతో బయటపడ్డారు. అదే సమయంలో సబ్‌స్టేషన్‌లో జంపర్ పడిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో పెద్ద ప్రాణాప్రాయం తప్పింది. ఈ సంఘటనతో ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు.

విద్యుత్ అధికారులపై ఆగ్రహం

విద్యుత్ స్తంభాలు కూలిన విషయాన్ని విద్యుత్ అధికారులకు ఫోన్ ద్వారా వెంటనే తెలిపినా స్పందించలేదని బాధిత రైతులు అశోక్‌రెడ్డి, పర్స రవీందర్, పాతూరి అంజిరెడ్డిలు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఉదయం సైతం ఏఈకి ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదన్నారు. దీంతో దుబ్బాక కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డికి రైతులు ఈ విషయాన్ని తెలిపారు. దీంతో ఆయన ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ ఘటనతో సుమారు 25 బోరుబావులకు కరెంట్ సరఫరా నిలిచిపోయిందని రైతులు తెలిపారు. తక్షణం ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



పొలాల్లో పడిన విద్యుత్ వైర్లు

వచ్చేనెల 14న జాతీయ లోక్‌అదాలత్



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి

సిద్దిపేటకమాన్: జిల్లా కోర్టులో సెప్టెంబర్ 14న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయిరమాదేవి తెలిపారు. సిద్దిపేట కోర్టులో పోలీసు, రెవెన్యూ, ఎక్సైజ్ శాఖల అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజీ పడే క్రిమినల్, ఎక్సైజ్ కేసులన్నింటినీ పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు స్వాతిరెడ్డి, మిలింద్ కాంబ్లె, జిల్లా రెవెన్యూ అధికారి నాగచైతన్య తదితరులు పాల్గొన్నారు.

6 ఇంటర్ చేంజ్‌లు



ఉత్తర భాగంలో ఇంటర్ చేంజ్‌లను సూచించే మ్యాప్ ఇదే

ట్రిపుల్ ఆర్ (రీజినల్ రింగ్ రోడ్డు) ఉత్తర భాగంలో ఇంటర్ చేంజ్ (కూడళ్ల)ల నిర్మాణంపై ఆసక్తికర చర్చ కొనసాగుతోంది. ఈ నిర్మాణాలు చేపట్టనున్న ప్రదేశాలు కీలకంగా మారనున్న నేపథ్యంలో అందరిదృష్టి వీటిపైనే కేంద్రీకృతమై ఉంది. తొలుత 100మీటర్ల వెడల్పుతో నిర్మిస్తున్న ఈ రహదారిపై హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు కంటే మెరుగ్గా ఇంటర్ చేంజ్‌ల నిర్మాణం జరగనుంది. ప్రత్యేకించి ఉమ్మడి మెదక్ జిల్లాలో జగదేవ్‌పూర్ నుంచి సంగారెడ్డి వరకు 110 కిలోమీటర్లకుపైగా నిడివిలో 6 చోట్ల నిర్మాణాలు చేపట్టడానికి నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన ఎన్‌హెచ్‌ఏఐ (నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా) మ్యాప్ 'సాక్షి' చేతికి చిక్కింది. - గజ్వేల్

- ట్రిపుల్‌ఆర్‌లో ప్రదేశాల గుర్తింపు
- జగదేవ్‌పూర్ మొదలుకొని సంగారెడ్డి వరకు..
- అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మాణం
- ఓఆర్‌ఆర్ కంటే మెరుగ్గా కూడళ్లు
- 'సాక్షి' చేతికి నేషనల్ హైవే అథారిటీ మ్యాప్

ఉమ్మడి నల్గొండ, ఉమ్మడి మెదక్ జిల్లాల పరిధిలోని ట్రిపుల్‌ఆర్‌పై 11చోట్ల ఇంటర్ చేంజ్‌ల నిర్మాణం చేపట్టాలని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్‌ఏఐ) నిర్ణయించింది. ప్రత్యేకించి ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలోని జగదేవ్‌పూర్ నుంచి సంగారెడ్డి వరకు 6 ఇంటర్ చేంజ్‌ల నిర్మాణం చేపట్టబోతున్నారు. 100 మీటర్ల వెడల్పుతో నాలుగు లేన్లుగా నిర్మించాలనుకుంటున్నారు. అవుటర్ రింగ్ రోడ్డు కంటే మరింత మెరుగ్గా అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దడానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ క్రమంలోనే ఉమ్మడి జిల్లాలో చేపట్టనున్న ఎన్‌హెచ్‌ఏఐ ఇంటర్ చేంజ్‌ల మ్యాప్‌ను 'సాక్షి' సంపాదించింది. మ్యాప్‌లో ఉన్న వివరాల ప్రకారం.. జగదేవ్‌పూర్ సమీపంలో, గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పాతూరు రింగ్ రోడ్డు జంక్షన్ సమీపంలో, వర్గల్ మండల మజీద్‌పల్లి, తూప్రాన్ ఎన్‌హెచ్–44 వద్ద, నర్సాపూర్ సమీపంలోని హైవేపై, సంగారెడ్డి వద్ద హైవేపైలపై ఇంటర్ చేంజ్‌ల నిర్మాణం జరగనున్నది.

భవిష్యత్తు అవసరాలకనుగుణంగా..

ముందుగా నాలుగు లేన్లుగా విస్తరించాలనుకుంటున్న ట్రిపుల్‌ఆర్.. భవిష్యత్తు అవసరాలకనుగుణంగా 8 లేన్లుగా విస్తరించనున్నారు. నిర్మాణం పనులు ప్రస్తుత హైద్రాబాద్ అవుటర్ రింగ్ రోడ్డుకు దీటుగా సాగనున్నదని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు చెబుతున్నారు. ట్రిపుల్ ఆర్ పక్కన సర్వీసు రోడ్ల ప్రతిపాదనలకు స్వస్తి పలికినట్లు వార్తలొస్తుండగా, ఇంటర్ చేంజ్ ప్రదేశాలే కీలకంగా మారనున్నాయి. రోడ్డు పూర్తిగా గ్రీన్ ఫీల్డ్ నిర్మాణం కాగా, గజ్వేల్, తూప్రాన్, నర్సాపూర్, సంగారెడ్డి లాంటి ప్రదేశాల్లో హైవేలు అడ్డుగా వస్తుండటంతో ఆయా ప్రదేశాల్లో హైవేలపైనుంచి రోడ్డు, ఇంటర్ చేంజ్‌ల నిర్మాణం జరుగనున్నది. దీని ద్వారా ట్రిపుల్‌ఆర్‌తో ఆయా రోడ్లకు ఎలాంటి అంతరాయం కలిగే అవకాశం ఉండదు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా పరిధిలోని గజ్వేల్ కాలా (కాంపీటెంట్ అథారిటీ ఫర్ ల్యాండ్ అక్విజిషన్) పరిధిలో 32కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం జరగనుండగా, తూప్రాన్ పరిధిలో 14కిలోమీటర్ల పొడవునా, నర్సాపూర్‌లో 28కిలోమీటర్ల మేర, సంగారెడ్డి పరిధిలో మరో 30కిలోమీటర్లకుపైగా ట్రిపుల్ ఆర్ రోడ్డు నిర్మాణం జరగనుంది.

అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మాణం

ట్రిపుల్‌ఆర్ అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మాణం జరగబోతున్నది. రోడ్డుపై కీలకమైన ఇంటర్ చేంజ్‌ల కోసం ఉత్తర భాగంలో 11 ప్రదేశాలను గుర్తించాం. ఈ ప్రదేశాల్లో ఎక్కే, దిగే వాహనాలకు సౌకర్యవంతంగా ఉండేలా డిజైన్ ఉంటుంది. ఈ ప్రదేశాలన్నీ ప్రస్తుత నగర ఔటర్ రింగ్ రోడ్డు కంటే మెరుగ్గా ఉంటాయి.

-మధుసూదన్‌రావు
ఎన్‌హెచ్‌ఏఐ ప్రాజెక్ట్ డైరెక్టర్

సాగర్‌లోకి గోదావరి పరవళ్లు



మల్లన్న సాగర్ రిజర్వాయర్‌లోకి పరుగులు పెడుతున్న గోదావరి జలాలు

ప్రస్తుత నీటిమట్టం 8.543 టీఎంసీలు

తొగుట(దుబ్బాక): కొమురవెల్లి మల్లన్న సాగర్ రిజర్వాయర్‌లోకి గోదారమ్మ పరవళ్లుతొక్కుతోంది. తుక్కాపూర్ పంప్‌హౌస్ నుంచి మల్లన్న సాగర్‌కు నీటిని ఎత్తిపోసే మోటార్లను ప్రాజెక్టు ఎస్‌ఈ బస్వరాజ్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 8.543 టీఎంసీలు నీటినిల్వ ఉన్నట్లు తెలిపారు. వానాకాలం పంటలకు అవసరమైన సాగునీటిని అందించేందుకు రిజర్వాయర్‌లోకి నీటిని ఎత్తిపోసే ప్రక్రియకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఈ నెల 13వ తేదీ వరకు నాలుగు మోటార్ల ద్వారా నీటిని ఎత్తిపోయనున్నట్లు ఆయన తెలిపారు. 13 నుంచి 18వ తేదీ వరకు రెండు పంపుల ద్వారా నీటిని ఎత్తిపోయనున్నట్లు తెలిపారు. రెండు పంపుల ద్వారా 2600క్యూసెక్కుల నీటిని పంపింగ్ చేస్తామన్నారు. దుబ్బాక, సిద్దిపేట, సిరిసిల్ల నియోజకవర్గాల్లో 1.25 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం కృషిచేస్తోందని బస్వరాజ్ తెలిపారు. కార్యక్రమంలో ఈఈ వేణుబాబు, డీఈ శ్రీనివాస్, నీటిపారుదల శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గౌరవెల్లి నిర్వాసితులను పట్టించుకోండి

కేంద్ర మంత్రి బండి సంజయ్‌ని కలిసిన బీజేపీ నాయకులు



కేంద్ర మంత్రికి సమస్యలు వివరిస్తున్న బీజేపీ నాయకులు

హుస్నాబాద్: గౌరవెల్లి ప్రాజెక్టు భూ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి బీజేపీ నాయకులు విన్నవించారు. ఈ మేరకు గురువారం ఢిల్లీలో కేంద్రమంత్రిని కలిసి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి ఫోన్‌లో సాక్షితో మాట్లాడారు. గౌరవెల్లి భూ నిర్వాసితుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని కోరామని చెప్పారు. నీటిపారుదల సౌకర్యం లేని రామవరం, అక్కన్నపేట, కట్కూర్, కన్నారం తదితర ఎగువ ప్రాంతాలకు గండిపెల్లి రిజర్వాయర్ ద్వారా నీరు అందించే అవకాశం ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే గండిపెల్లి రిజర్వాయర్ పనులు చేపట్టాలని కోరామని చెప్పారు. అలాగే పందిల్ల నుంచి హుస్నాబాద్ శివారు వరకు డివైడర్‌తో కూడిన 4 లేన్ల రోడ్డు వేయాలని కోరినట్లు తెలిపారు. హుస్నాబాద్ నుంచి గౌరవెల్లి మీదుగా రామవరం వరకు నిధులు మంజూరైనా రోడ్డు నిర్మాణం చేపట్టడంలేదని, సంబంధిత అధికారులకు ఆదేశాలివ్వాలని విన్నవించినట్లు చెప్పారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ సానుకూలంగా స్పందించారన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని గ్రామాల్లో కాషాయ జెండా ఎగురవేయాలని బండి సంజయ్ సూచించారని రాంగోపాల్‌రెడ్డి తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో అక్కన్నపేట పార్టీ మండల అధ్యక్షుడు రామంచ మహేందర్ రెడ్డి, కట్కూర్ మాజీ సర్పంచ్ అశోక్ రెడ్డి, వీహెచ్‌పీ భార్గవపురం ఖండ ప్రముఖ్ నాగరాజు తదితరులు ఉన్నారు.

నైపుణ్యం ఉంటేనే రాణింపు

- యువతతో కలెక్టర్ మనుచౌదరి
- ఐటీ టవర్ సందర్శన



శిక్షణ పొందుతున్న యువతతో మాట్లాడుతున్న కలెక్టర్

సిద్దిపేటఅర్బన్: ఏ రంగంలోనైనా రాణించాలంటే నైపుణ్యం(స్కిల్స్) ఉండాలని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. గురువారం సిద్దిపేట పట్టణ శివారులోని నాగులబండ వద్ద గల ఐటీ టవర్‌ను కలెక్టర్ సందర్శించారు. వివిధ సాఫ్ట్‌వేర్ కంపెనీలు యువతకు ట్రైనింగ్ ఇచ్చి ఉద్యోగం కల్పిస్తున్నాయని ఐటీ టవర్ యాజమాన్యం కలెక్టర్‌కు వివరించారు. టాస్క్ సాఫ్ట్‌వేర్ ట్రైనింగ్ సెంటర్‌లో యువతతో ముచ్చటించి ట్రైనింగ్ గురించి అడిగి తెలుసుకున్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగమే కాకుండా ఎలాంటి రంగంలోనైనా రాణించాలంటే నైపుణ్యం ముఖ్యమని, మారుతున్న కాలానికి అనుగుణంగా సాఫ్ట్‌వేర్ రంగంలో వస్తున్న నూతన ఒరవడులను అందిపుచ్చుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట టీఎస్ఐఐసీ డీఈ జ్యోతి, టీ–హబ్ ప్రతినిధులు ఉన్నారు.

పునర్వినియోగంపై అరా..

సిద్దిపేటజోన్: మున్సిపల్ పర్యవేక్షణలో కొనసాగుతున్న డ్రై రిసోర్స్ కలెక్షన్ సెంటర్, బుస్సాపూర్‌లోని సాలీడ్ లిక్విడ్ వెస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్‌లను గురువారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్, టి హబ్ టీం ప్రతినిధులతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. పారిశుద్ధ్య కార్మికులు సేకరించిన తడి, పొడి చెత్తను వర్మీ కంపోస్ట్, ప్లాస్టిక్ రీ ప్రాసెసింగ్ ప్రక్రియ పరిశీలించారు. బయో గ్యాస్ ప్లాంట్ సందర్శించి వివరాలు తెలుసుకున్నారు.

సారు.. ఇదేం తీరు

- సమయ పాలన పట్టని అధికారులు
- సేవలు అందక ఇబ్బందుల్లో ప్రజలు
- 'సాక్షి' విజిట్‌లో వెలుగుచూసిన నిజాలు



ఎంపీడీఓ కార్యాలయంలో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

కొండపాక(గజ్వేల్): అధికారులు ఏమాత్రం సమయ పాలన పాటించడం లేదు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో సేవలు అందక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. గురువారం 'సాక్షి' విజిట్‌లో అనే విషయాలు వెలుగుచూశాయి. గురువారం ఉదయం 11:15 గంటలకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయాన్ని 'సాక్షి' విజిట్ చేసింది. ఈ సమయంలో ఎనిమిది మంది ఉద్యోగుల్లో ఏ ఒక్కరూ హాజరుకాకపోవడం గమనార్హం. కుర్చీలన్నీ ఖాళీగా దర్శనమిచ్చాయి. దీంతో అక్కడున్న అటెండర్‌ను అధికారులు ఎవ్వరు రాలేదన్న ప్రశ్నకు నాకేం తెలియదన్న సమాధానమే వచ్చింది. ప్రభుత్వం ఇటీవల స్వీకరించిన ప్రజాపాలన దరఖాస్తుల్లో జరిగిన తప్పిదాలను సరి చేయించుకునేందుకు వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు అధికారులు లేకపోవడంతో నిరాశగా వెనుదిరిగారు. పడిగాపులు కాశారు. అధికారులు సమయ పాలన పాటిస్తూ ప్రజా సమస్యలను పరిష్కరించాలని వారు కోరుతున్నారు. ఈవిషయమై ఎంపీడీఓ వెంకటేశ్వర్లను వివరణ కోరగా కుకునూరుపల్లి మండలం ఎర్రవల్లి (మల్లన్న సాగర్ ముంపు గ్రామం) గ్రామ ప్రత్యేకాధికారిని అని, గజ్వేల్ మండలంలోని ముట్రాజ్‌పల్లి ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోని ఏర్పాటు చేసిన సమావేశంలో ఉన్నానన్నారు. అలాగే సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న రాంప్రసాద్‌కు ఫోన్ చేయగా మంగోల్ గ్రామ ప్రత్యేకాధికారిగా బాధ్యతను అప్పగించడంతో అక్కడున్నానంటూ కుంటిసాకులు చెప్పడం గమనార్హం.

వ్యాధులపై అప్రమత్తత అవసరం

జిల్లా వైద్యాధికారి ధనరాజ్

సిద్దిపేటరూరల్: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ధనరాజ్ అన్నారు. గురువారం ఇర్కోడ్ గ్రామంలో నిర్వహించిన స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో వైద్యారోగ్య శాఖ అధికారి పాల్గొన్నారు. గ్రామంలోని ప్రధాన వీధుల్లో తిరుగుతూ కార్యక్రమం పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ధనరాజ్ మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటుగా పరిసరాల పరిశుభ్రత కూడా ఎంతో ముఖ్యమన్నారు. ప్రజలకు అన్ని వేళలా అందుబాటులో ఉండేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. డిప్యూటి డీఎంహెచ్‌ఓ రేవతి, డాక్టర్ వినోద్‌బాబ్జి, బాబురెడ్డి, ఎంపీడీఓ మురళీధర్‌శర్మ, సిబ్బంది పాల్గొన్నారు.



ఇర్కోడ్‌లో స్వచ్ఛదనంపై అవగాహన

విద్యార్థుల ఉన్నతికి బాటలు



ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న నవోదయ ప్రిన్సిపాల్ రాజేందర్

- ఎమ్మెల్సీ రఘోత్తమ రెడ్డి
- నవోదయలో ముగిసిన అథ్లెటిక్ మీట్

వర్గల్(గజ్వేల్): చదువుతోపాటు ఆటలకు అత్యంత ప్రాధాన్యమిస్తూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి నవోదయ విద్యాలయాలు బాటలు వేస్తున్నాయని ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి అన్నారు. అలాంటి విద్యాలయాల్లో సీటు సాధించిన విద్యార్థులు ప్రతి అవకాశం సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. గురువారం వర్గల్ నవోదయలో క్లస్టర్‌స్థాయి అథ్లెటిక్ మీట్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. క్రీడా పోటీలలో గెలుపోటములు సహజమని, విద్యార్థులలో మానసికోల్లాసానికి, సంఘటితత్వానికి, నాయకత్వ లక్షణాలు పెంపొందింపజేసేందుకు దోహదపడతాయన్నారు. నవోదయ ఉపాధ్యాయుల, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఆతిథ్య నవోదయ ప్రిన్సిపాల్ రాజేందర్ మాట్లాడుతూ అథ్లెటిక్ మీట్ జయప్రదం చేసిన ప్రతిఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులను అత్యుత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా నవోదయ ముందుకుసాగుతుందన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శశిధర్‌శర్మ తదితరులు పాల్గొన్నారు. ముగింపు వేడుక సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. రెండోరోజు గురువారం రన్నింగ్, హైజంప్, షాట్‌పుట్, హర్డిల్స్ తదితర 84 క్రీడాంశాలలో ఫైనల్ పోటీలు ముగిశాయి. రీజినల్ మీట్‌కు ఎంపికైన క్రీడాకారుల వివరాలు శుక్రవారం వెల్లడించనున్నట్లు వ్యాయామ ఉపాధ్యాయులు మోహన్‌రావు, వెంకటలక్ష్మి పేర్కొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి క్రీడా పాఠశాలకు విద్యార్థిని ఎంపిక

మెదక్ మున్సిపాలిటీ: జిల్లాకేంద్రంలోని చైతన్య భారతి పాఠశాల విద్యార్థి సహస్ర రాష్ట్రస్థాయి క్రీడా పాఠశాలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ జుబేర్ అహ్మద్ తెలిపారు. గురువారం పాఠశాలలో విద్యార్థినిని అభినందించారు. ఈ సందర్భంగా జుబేర్ మాట్లాడుతూ, పాఠశాలలో చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రవణ్, వైస్ ప్రిన్సిపాల్ నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాతి పూర్ణకుంభం చోరీ

మద్దూరు(హుస్నాబాద్): పురాతన రాతి పూర్ణకుంభం బుధవారం రాత్రి చోరీకి గురైంది. ఈ సంఘటన మండలంలోని వల్లంపట్ల గ్రామంలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. బొర్ర పోతనగా పిలువబడే సుమారు ఆరడుగుల వినాయక విగ్రహంతో పాటు పూర్ణకుంభాన్ని కొన్నేళ్ల క్రితం గ్రామంలోని వేముల చెరువు దగ్గరి నుంచి తీసుకు వచ్చి ఆంజనేయస్వామి ఆలయంలో ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఆ విగ్రహాలు గ్రామస్తుల ద్వారా పూజలందుకుంటున్నాయి. గ్రామంలో ఉన్న రాతి పూర్ణకుంభం చాలా అరుదుగా ఉన్నాయని చరిత్రకారులు చెబుతున్నారు. అంతటి ప్రాధాన్యత కల్గిన వస్తువులు చోరీకి గురికావడం పట్ల గ్రామస్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. దాని అడుగు భాగంలో గుప్తనిధులు ఉండవచ్చునని పలువురు భావిస్తున్నారు. కాగా సంఘటన స్థలాన్ని మద్దూరు పోలీసులు సందర్శించి వివరాలు సేకరించారు.

సరస్వతీ క్షేత్రంలో చోరీకి విఫలయత్నం


దోర్ వద్ద ఆయుధం

వర్గల్(గజ్వేల్): సరస్వతీ క్షేత్రంలో బుధవారం అర్ధరాత్రి నలుగురు దొంగలు చోరీకి విఫలయత్నం చేశారు. ఈ సంఘటన వర్గల్‌లో ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొండపైన ఉత్తర ద్వారం ఎగ్జిట్ డోర్ వద్ద సీసీ కెమెరా వైర్లు కట్ చేశారు. ఎగ్జిట్ డోర్ తెరచుకోకపోవడం, అలికిడి విని సెక్యూరిటీ సిబ్బంది అటు వైపు వచ్చారు. అప్పటికే వారు ఇక్కడ నుంచి పారిపోయారు. ఆలయంలో కత్తి పడి ఉండటాన్ని ఆలయ సిబ్బంది గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి ఘటన స్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీమ్ ఆధారాలు సేకరించింది. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


ఒకరి అదృశ్యం


సికేంద్ర

పటాన్‌చెరు టౌన్: ముగ్గురు కల్లు తాగి తిరిగొస్తున్న క్రమంలో ఒకరు అదృశ్యమయ్యారు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ వెంకటరెడ్డి కథనం ప్రకారం... జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన సికేంద్ర పటాన్‌చెరు మండలం పెద్దకంజర్ల సమీపంలో అరబిందో తత్వ టౌన్ షిప్‌లో కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. 4 నెలల క్రితం బతుకుదెరువు కోసం ఈ ప్రాంతానికి వచ్చాడు. ఈనెల 5న సాయంత్రం భూమన్, లక్ష్మణ్‌లతో కలిసి అతను మండలంలోని ఇంద్రేశంలో ఉన్న కల్లు దుకాణంలో తాగారు. ఈ మత్తులో నడుచుకుంటూ వెళ్తూ మార్గమధ్యలో కింద పడిపోయారు. అందులో భూమన్, లక్ష్మణ్‌లు ఆ రోజు రాత్రే నిద్ర లేచి పని ప్రాంతానికి వెళ్లారు. సికేంద్ర మాత్రం రూమ్‌కు రాలేదు. అతని కోసం కాంట్రాక్టర్ ప్రదీప్ కుమార్ తెలిసిన వారి వద్ద స్థానికంగా వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఈ అదృశ్యంపై బుధవారం రాత్రి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నాటు బాంబుల మోత


ఉమ్మాపూర్ అడవిలో వేటగాళ్ల దుశ్చర్య
- కాపరులకు పొంచి ఉన్న ప్రాణహాని
- నాడు చిరుత, నిన్న రైతుకు గాయాలు ఘటనలే నిదర్శనం


మీర్జాపూర్‌లో మైసమ్మ గుట్ట

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం ఉమ్మాపూర్ అడవిలో పశువులు, గొర్రెల మందలను కాపరులు మేపుతుంటారు. ఇదే వారి జీవనాధారం. అలాగే పల్లె జీవులకు ఉపాధి కల్పిస్తుంది ఆ ప్రాంతం. కానీ రాత్రిళ్లు ఆహారం కోసం గుహల నుంచి బయటకు వచ్చే జంతువులను వేటగాళ్లు వేటాడుతున్నారు. వన్యప్రాణులను చంపి మాంసాన్ని పొరుగు గ్రామాల్లో విక్రయిస్తుంటారు. వీటిని వేటాడే క్రమంలో ఉచ్చులు, నాటు బాంబులను ఎరగా వాడుతుండటంతో పశువులు, గొర్రెల కాపరులు బలవుతున్నారు. ఈ మేరకు కథనం

- ఇటీవల జిల్లెలగడ్డ మైసమ్మ గుట్ట కింద రైతు ఖలీల్ గేదెను మేతకు తోలగా నాటు బాంబు పేలి చేతి వేళ్లు తెగాయి. 2017 మే 31న మహ్మదాపూర్ గుట్టల్లో వేటగాళ్లు పెట్టిన ఉచ్చులో చిరుత చిక్కుకుంటే దాని కాళ్ల గోర్లు నరికి తీసుకెళ్లారు. భీమదేవరపల్లి మండలం గట్ల నర్సింగాపూర్‌లో ఓ రైతు మొక్కజొన్న చేనులో కూలీలు పనులు చేస్తుండగా నాటు బాంబులు పేలి కూలీలకు గాయాలయ్యాయి. వేటగాళ్ల వెంట తీసుకెళ్లిన కుక్కలు కూడా నాటు బాంబులను తిని మరణించిన సందర్భాలున్నాయి.

అటవీ విస్తరణ ఇలా


2017లో మహ్మదాపూర్ గుట్టల్లో వేటగాళ్ల ఉచ్చుకు మృతిచెందిన చిరుత (ఫైల్)

ఉమ్మాపూర్ అటవీ ప్రాంతం సిద్దిపేట, కరీంనగర్, హన్మకొండ జిల్లాలోని హుస్నాబాద్, అక్కన్నపేట, సైదాపూర్, భీమదేవరపల్లి మండలాల సరిహద్దు గ్రామాలు కేశ్వాపూర్, జిల్లెలగడ్డ, మీర్జాపూర్, మంచీళ్ల బండ, ఉమ్మాపూర్, మహ్మదాపూర్, ఆకునూర్, రాంగనగర్, గట్లనర్సింగాపూర్, బొల్లోనిపల్లి, మంగళపల్లి గ్రామాలను తాకుతూ అటవీ ప్రాంతం విస్తరించింది. మూడు జిల్లాల నుంచి జంతువుల వేట కోసం వేటగాళ్లు వస్తారు. గ్రానైట్ క్వారీలు, బావులు తవ్వడానికి వినియోగించే జిలెటిన్ స్టిక్స్, పేలుడు పదార్థాలను వీరు నాటు బాంబులకు వాడుతారు. అడవి పందులు తినే ఆహారానికి చుట్టి గుట్టల నుంచి కిందకు వచ్చే జంతువుల దారిలో నాటు బాంబులు పెడుతారు. పందులు పంట చేళ్ల వస్తాయని రైతుల చేళ్లలోనే పెడుతుంటారు. వేటగాళ్లు పెట్టిన నాటు బాంబులను అడవి పిల్లులు నోటి ద్వారా కరుచుకుని మరో ప్రదేశంలో పడేస్తాయి. దీంతో రైతులు, పశువులు, గొర్రెల కాపరులు బలైతున్నారు.

అడవిలోనే బాంబుల గోదాం

జిల్లెలగడ్డ అటవీ ప్రాంతంలోనే జిలెటిన్ స్టిక్స్ నిల్వ చేయడానికి ఓ వ్యాపారి ఉమ్మాపూర్ గ్రామ పంచాయతీ నుంచి అనుమతి తీసుకొని గోదాం నిర్మించాడు. ఇక్కడి నుంచి గ్రానైట్ క్వారీలు, కంప్రెషర్ వాహనాలకు, బావులు తవ్వేవారికి బాంబులను సరఫరా చేస్తారని గ్రామస్తులు చెబుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వేటగాళ్ల చేతులకు మందు గుండు సామగ్రి పోవడంతో వారు నాటు బాంబులు తయారు చేసి జంతువులను వధిస్తున్నారు.


ఇటీవల నాటు బాంబు పేలి రైతు గాయపడ్డ ప్రదేశంలో పోలీసుల పరిశీలన

దర్యాప్తు చేస్తున్నాం

మీర్జాపూర్ మైసమ్మ గుట్ట ప్రాంతంలో నాటు బాంబు పేలి రైతుకు గాయాలైన సంఘటన ప్రదేశాన్ని పరిశీలించాం. దాన్ని ఎవరు పెట్టారు.. ఏట్లా వచ్చిందనే కోణంలో దర్యాప్తు చేస్తున్నాం. జంతువుల వేటకు వెళ్లే వారి పై నిఘా పెట్టాం. బాంబులు అడవిలోకి పోకుండా చర్యలు తీసుకుంటాం.

– పి.మహేశ్, ఎస్సై, హుస్నాబాద్

ఆ బియ్యం ఎక్కడివి?

- లోడు లారీని అడ్డుకున్న స్థానికులు
- పోలీసులు స్టేషన్‌కు తరలించి రెవెన్యూ శాఖకు సమాచారం
- నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్నట్లు అధికారుల గుర్తింపు


బియ్యం లోడు లారీ

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని ముస్త్యాల గ్రామంలో 290 క్వింటాళ్ల బియ్యం లోడుతో వెళ్తున్న లారీని గురువారం ఉదయం కొందరు వ్యక్తులు అడ్డుకున్నారు. లోడ్ ఎక్కడికి వెళ్తుందని అడగగా డ్రైవర్ ఇచ్చిన సమాధానంపై అనుమానం వచ్చి వెంటనే 100కి డయల్ చేసి పోలీసులకు సమాచారమిచ్చారు. వెంటనే అక్కడకు చేరుకొని లారీని స్టేషన్‌కి తరలించి, రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఇదిలా ఉంటే లారీలో ఉన్న బియ్యం మండల పరిధిలోని ముస్త్యాల శివారులోని రేణుక పారా బాయిల్డ్ రైస్ మిల్లులో లోడ్ చేసినట్లు డ్రైవర్, స్థానికులు చెబుతున్నారు. డ్రైవర్ వద్ద ఉన్న పత్రాల్లో నంగునూరు మండలం రాంపూర్‌లోని శ్రీనిధి ఇండస్ట్రీస్ నుంచి కాజీపేట ఎఫ్‌సీఐకి బియ్యం వెళ్తున్నట్లు ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది. ప్రభుత్వం కొనుగోలు చేసే ధాన్యం సరఫరా చేయని మిల్లు నుంచి ఎఫ్‌సీఐకి బియ్యంలోడు వెళ్లడం ఏమిటని స్థానికంగా చర్చించుకుంటున్నారు. కాగా, తహసీల్దార్ సమీర్ అహ్మద్ ఖాన్ ఆదేశాల మేరకు స్టేషన్‌కు వచ్చిన ఆర్ఐ రాజేందర్‌రెడ్డి బియ్యం నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్నట్లు గుర్తించామని, తదుపరి చర్యల కోసం ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతున్నామన్నారు. ఈ విషయమై డీఎం హరీశ్‌ను సంప్రదించగా డీఎస్ఓతో మాట్లాడండి అన్నారు. డీఎస్ఓ తనుజతో మాట్లాడగా సదరు రైస్ మిల్లుకు సీఎంఆర్ కోసం ఎలాంటి ధాన్యం పంపలేదన్నారు. తాను సమావేశంలో ఉన్నానని తర్వాత మాట్లాడతానని ఫోన్ పెట్టేశారు.

వృద్ధురాలి దారుణ హత్య

- నగదు, బంగారం కోసం గొంతునులిమి.. తలపై కర్రతో కొట్టి..
- కాద్లూర్‌లో ఘటన


అంజమ్మ (ఫైల్)

టేక్మాల్(మెదక్): ఓ వృద్ధురాలు దారుణ హత్యకు గురైంది. నగదుతో పాటు బంగారు ఆభరణాల కోసం గొంతు నులిమి, కర్రతో తలపై బలంగా కొట్టి చంపారు. ఈ సంఘటన టేక్మాల్ మండలం కాద్లూర్‌లో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఓబలి అంజమ్మ(70) గ్రామ సమీపంలోని దత్తాత్రేయ ఆశ్రమంలోని గుడిసెలో ఒంటరిగా నివాసం ఉంటుంది. ఆమె అల్లుడు సాలోజిపల్లికి చెందిన వేముల రాములు ఉదయం, రాత్రి వేళల్లో రోజూ భోజనం తీసుకు వచ్చి ఇస్తుంటాడు. రోజులాగే బుధవారం రాత్రి 10.20 గంటల సమయంలో అతను టిఫిన్ తీసుకొని వచ్చాడు. అప్పటికే స్పృహ లేకు పడి ఉన్నా అత్తను పలకరించినా ఉలుకు పలుకులేదు. చుట్టుపక్కల గమనిస్తే కాద్లూర్‌కు చెందిన నదరి శివకుమార్ గుడిసెలో దాక్కొని కనిపించాడు. ఈ విషయమై నిలదీస్తే అతనిపైనా కర్రతో దాడికి ప్రయత్నించాడు. మరో కర్రతో ఎదురుదాడి చేసే ప్రయత్నంలో శివకుమార్ అక్కడి నుంచి పారిపోయాడు. అంజమ్మ మెడలోని బంగారు గుండ్లు తీసుకొని గొంతు నులిపి కర్రతో తలకు బలంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందిందని పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్ రెడ్డి, అల్లాదుర్గం ఎస్సై ప్రవీణ్‌రెడ్డి, స్థానిక ఏఎస్ఐలు దయానంద్, తుక్కయ్య, సిబ్బంది వెళ్లి క్లూస్‌టీం సహాయంతో పంచనామా నిర్వహించా రు. రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

స్పెషల్ పార్టీ పోలీసులమంటూ..

సినీ ఫక్కీలో చోరీ
- వృద్ధుడిని మోసం చేసి బంగారం తస్కరణ
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు

సిద్దిపేటకమాన్: ఓ వృద్ధుడికి మాయమాటలు చెప్పి సినీ ఫక్కీలో బంగారు నగలు కాజేసి నలుగురు దుండగులు ఉడాయించారు. ఈ ఘటన పట్టణంలో గురువారం చోటుచేసుకుంది. సిద్దిపేట టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన వృద్ధుడు ఇలందుల యాదగిరి కొంతకాలంగా వైశ్యభవన్ వద్ద పప్పుదినుసుల వ్యాపారం చేస్తున్నాడు. మధ్యాహ్నం సుభాష్‌రోడ్డులోని ఓ హోటల్‌లో టీ తాగి బైక్‌పై తిరిగి షాపునకు వెళుతుండగా మధ్యలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఆపారు. తాము స్పెషల్ పార్టీ పోలీసులమని నమ్మబలికారు. ఈ క్రమంలో ఇదే ముఠాకు చెందిన మరో వ్యక్తిని మూడో వ్యక్తి ఆపి బంగారు నగలు ధరించి బయట తిరిగితే పోలీసులు జరిమానా విధిస్తున్నారంటూ వృద్ధుడి ఎదుట నటించి అతడి ఓ గొలుసును ఓ పేపర్‌లో పెట్టి తిరిగి ఇచ్చేశారు. ఈ తతంగం అంతా వృద్ధుడికి కనిపించేలా జరిగింది. ఈయన మెడలో ఉన్న బంగారు గొలుసు, చేతికి ఉన్న బంగారు ఉంగరం (మూడు తులాలు) తీసి భద్రపర్చుకోవాలని ఓ పేపర్ ఇచ్చి అందులో నగలను వేయించారు. మాయ మాటల్లో పెట్టి నగలు పెట్టిన పేపర్‌కు బదులు గులకరాళ్లు పెట్టిన మరో పేపర్‌ను అందించారు. కొంత సేపటికి యాదగిరి కొంచెం ముందుకు వెళ్లి పేపర్ తెరిచి చూస్తే అందులో గులకరాళ్లు ఉండటంతో కంగుతిని లబోదిబోమన్నాడు. వెంటనే బాధితుడు సిద్దిపేట టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఆ ప్రాంతంలో ఉన్న సీసీ ఫుటేజీని పోలీసులు పరిశీలిస్తున్నారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

- ఒత్తిడా? ప్రేమ వ్యవహారమా?
- ఆలస్యంగా వెలుగులోకి ఘటన


సుప్రజ(ఫైల్)

టేక్మాల్(మెదక్): ఇంటర్ విద్యార్థిని ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన మెదక్ జిల్లా టేక్మాల్ మండలం తంప్లూర్ గ్రామంలో గురువారం ఆలస్యంగా వెలుగు చూసింది. స్థానిక ఏఎస్ఐ దయానంద్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గోష్కె సుప్రజ(16) హవేళిఘనపూర్‌లోని ఎంజేబీ హాస్టల్‌లో ఉంటూ ఇదే కళాశాలలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతోంది. గత నెల 30న ఎవరికీ చెప్పకుండా తంప్లూర్‌లోని ఇంటి కొచ్చింది. మరుసటి రోజు సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో దూలానికి ఉరి వేసుకొని మృతిచెందింది. ఈనెల 1న మధ్యాహ్న సమయంలో పొలంలో పూడ్చిపెట్టారు. ఆత్మహత్య చేసుకోవడానికి చదువు ఒత్తిడేనని కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. కానీ గ్రామానికి ఓ యువకుడు కొన్ని నెలలుగా ప్రేమ పేరుతో మానసికంగా, శారీరకంగా వేధిస్తుండేవాడని గ్రామస్తుల ద్వారా తెలిసింది. యువతి మృతి పట్ల అనుమానం ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు మృతురాలి మామ గొష్కె సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ దయానంద్ తెలిపారు.

డీసీఎం బోల్తా


డీసీఎంను పరిశీలిస్తున్న పోలీసులు

చిన్నశంకరంపేట(మెదక్): డీసీఎం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ సంఘటన నార్సింగి జాతీయ రహదారి కాస్లాపూర్ వద్ద గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... హైదారాబాద్ నుంచి నిజామాబాద్ వైపు వెళ్తున్న డీసీఎం అతివేగంగా వచ్చి అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు స్థలానికి చేరుకున్నారు. అనంతరం 108లో క్షతగాత్రుడిని రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ వివరాలను పోలీసులు నమోదు చేసుకున్నారు.

23 మందికి జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని పలు చోట్ల వారం రోజుల క్రితం తమ సిబ్బందితో కలిసి ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. ఇందులో 23 మంది వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి 23 మందికి రూ.20,800 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

నిర్లక్ష్యం ఖరీదు నిండు ప్రాణం

- బాలుడిని ఢీకొన్న కారు
- ముగ్గురు మైనర్ల నిర్లక్ష్యపు డ్రైవింగే కారణం
- పదిరోజులు మృత్యువుతో పోరాడి తుదిశ్వాస

మెదక్ మున్సిపాలిటీ: ముగ్గురు మైనర్ల నిర్లక్ష్యపు డ్రైవింగ్ ఓ బాలుడిని బలిగొన్నది. తీవ్రంగా గాయపడి కోమాలోకి వెళ్లిన కొడుకును కాపాడుకునేందుకు ఆ తల్లిదండ్రులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. పదిరోజుల పాటు మృత్యువుతో పోరాడిన అతను గురువారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలు.. మెదక్ పట్టణం దుర్గా కాలనీలో నివాసం ఉండే దండుగుల నర్సింహులు కుమారుడు సాత్విక్ (11) గత నెల 28న ఉదయం పాల కోసం వెళుతున్నాడు. ముగ్గురు మైనర్లు కారు డ్రైవింగ్ చేస్తూ సాత్విక్‌ను ఢీకొట్టారు. ఈ ఘటనలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుడు మైసయ్య అక్కడికక్కడే మృతిచెందగా.. తీవ్ర గాయపడి కోమాలోకి వెళ్లిన సాత్విక్‌ను వెంటనే ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆర్థికంగా అంతగా లేని ఆ కుటుంబం కుమారుడిని కాపాడుకునేందుకు చేసిన ప్రయత్నాలు అన్ని ఇన్ని కావు. అప్పు చేసి రూ. లక్షలు ఖర్చు చేశారు. దేవుడా మా బిడ్డను బతికించు అని మొక్కుకున్నారు కుమారుడు బతికొస్తాడని గంపెడాశ పెట్టుకున్న తల్లిదండ్రులకు నిరాశే మిగిలింది. పది రోజులపాటు మృత్యువుతో పోరాడి గురువారం తుది శ్వాసవిడిచాడు. కొడుకు మృతితో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

తాళం వేసిన ఇంట్లో చోరీ

సిద్దిపేటకమాన్: ఇంటి తాళాలు పగులగొట్టి బంగారు నగలు, నగదు గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. రిటైర్డ్ ఉద్యోగి అశోక్‌కుమార్ తన కుటుంబంతో కలిసి శంకర్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. బెంగుళూర్‌లో ఉన్న కుమార్తె దగ్గరికి గత నెల 7న పట్టణంలోని తన ఇంటికి తాళం వేసి వెళ్లారు. బెంగుళూరు నుంచి గురువారం తిరిగొచ్చి చూస్తే తాళాలు పగుల గొట్టి బీరువాలో ఉన్న తులంన్నర బంగారు వస్తువులు, రూ.40 వేల నగదు గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లినట్లు గుర్తించి పోలీసులను ఆశ్రయించారు.

విద్యుదాఘాతంతో మరొకరు..

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): విద్యుత్ షాక్‌తో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన గురువారం మండల పరిధిలోని నందికంది గ్రామశివారులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మర్పల్లి మండలం తుమ్మలపల్లికి చెందిన బోయిని కుమార్ (35)కూలి పనులు చేస్తూ జీవనాన్ని సాగిస్తున్నాడు. సదాశివపేట మండలం నందికంది గ్రామశివారులో గల ఓ వెంచర్లో వెంచర్‌కు సంబంధించిన జెండాలను పాతడానికి వచ్చాడు. పాతుతున్న క్రమంలో కట్టెను పైకి ఎత్తుతుండగా పైన ఉన్న కరెంటు వైర్లు తగిలి షాక్‌కు గురయ్యాడు. వెంటనే స్థానికులు చికిత్స కోసం సదాశివపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన డాక్టర్లు మృతిచెందినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మద్యం స్వాధీనం


పందిల్ల బెల్టు షాపులో పట్టుకున్న మద్యం, నిందితుడిని చూపుతున్న పోలీసులు

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం పందిల్లలో బొమ్మగాని ఎల్లాగౌడ్ కిరాణా షాపు పై టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం రాత్రి దాడి చేసి అక్రమ మద్యంను పట్టుకున్నట్లు ఎస్సై మహేశ్ గురువారం తెలిపారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా బెల్టు షాపుల నిర్వహణ, ఇసుక , మట్టి రవాణా చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. పేదలకు ఇచ్చే రేషన్ బియ్యంను అక్రమంగా కొనుగోలు చేసి వ్యాపారం చేస్తే కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. గ్రామాల్లో అక్రమ దందాలు సాగితే 87126-67445 నంబర్‌లో సమాచారం ఇవ్వాలన్నారు.

పూడికతీతతో రైతులకు మేలు

లోడి సంస్థ డైరెక్టర్ ఇన్నారెడ్డి

అక్కన్నపేట(హుస్నాబాద్): బావుల్లో పూడి కతీత వల్ల రైతులకు ఎంతో గానో మేలు జరుగుతుందని లోడి సంస్థ డైరెక్టర్ ఇన్నారెడ్డి అన్నారు. లోడి సాంఘిక సేవా సంస్థ ఆధ్వర్యంలో మనోస్ యూనిదాస్ వారి సహకారంతో అక్కన్నపేట మండలంలోని వివిధ గిరిజన తండాల రైతుల భాగస్వామ్యంతో వారి బావుల్లో పూడికతీత నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బోవుల్లో మట్టి, చెత్తాచెదారం తదితర పేరుకుపోయి ఉండగా లోడి సంస్థ ముందుకు వచ్చి బావుల్లో పూడికతీత కార్యక్రమాలు చేపడుతుందన్నారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదేవిధంగా రైతులు సేంద్రియ వ్యవసాయ పద్ధతిలో వ్యవసాయం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ ఎం. బాలశౌరి, మండల ఫీల్డ్ కో–ఆర్డినేటర్ కోడం సత్యనారాయణ, సిబ్బంది కనకం, రవీందర్, భూక్య బిచ్చ, మూడావత్ తిరుమల, పిల్లి రమేశ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

డీలర్లకు బియ్యం కోత

- పౌరసరఫరా గోదాంలోనే తతంగం
- ముక్కిన బియ్యం పేదలకు పంపిణీ


రేషన్ షాపులో బియ్యం బస్తాలు

అల్లాదుర్గం(మెదక్): పౌర సరఫరా గోదాం నుంచి డీలర్లకు సరఫరా అయ్యే బియ్యంలో కోత విధిస్తున్నారు. బస్తాకు వచ్చి 5 నుంచి 11 కిలోల వరకు తరుగు ఉంటుంది. ఈ బియ్యంను గోదాం ఇన్‌చార్జిలు బ్లాక్‌లో అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారని, పెద్దశంకరంపేట పౌర సరఫరా గోదాంలోనే ఇదంతా జరుగుతుందని ఆరోపణలున్నాయి. ఆపై రేషన్ షాపుల ద్వారా నిరుపేదలకు ముక్కిన బియ్యం సరఫరా చేస్తున్నారు.

పెద్దశంకరంపేట పౌర సరఫరాల గోదాం నుంచి అల్లాదుర్గం, రేగోడ్, పెద్దశంకరంపేట మండలాల్లోని రేషన్ షాపులకు, ప్రభుత్వం పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను బియ్యం సరఫరా అవుతోంది. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు 50 కేజీల బస్తాకు ఐదారు కిలోల తరుగు వస్తుందని చెబుతున్నారు. తరుగుతో పాటు దుమ్ము ధూళి, పురుగులు పట్టిన బియ్యం పంపుతున్నారు. సంబంధిత గోదాం అధికారులకు ఎన్నో మార్లు ఫిర్యాదులు చేసినా ఎలాంటి స్పందన లేదని ఉపాధ్యాయులు, ఐసీడీఎస్ అధికారులు ఆవేదన వ్యక్తం చేశారు.

బస్తాకు 11 కేజీల తరుగు

పౌర సరఫరా గోదాం నుంచి రేషన్ షాపులకు 50 కేజీల బస్తాలను బియ్యం సరఫరా చేస్తున్నారు. ఇందులో 5 నుంచి 11 కేజీల వరకు తరుగు వస్తుంది. డీలర్లు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా మారడం లేదు. 10 బస్తాలు సరఫరా అయితే 40 నుంచి 50 కేజీల తరుగు వస్తుందని డీలర్లు లబోదిబోమంటున్నారు. దీంతో వారు దాన్ని వినియోగదారులపై రుద్దుతున్నారు. కాగా, తరుగుతో గోదాం ఇన్‌చార్జికి నెలకు 50 నుంచి 60 క్వింటాళ్ల వరకు బియ్యం మిగులుతుందని డీలర్లు ఆరోపిస్తున్నారు. మిగిలిన బియ్యాన్ని రైస్ మిల్లులకు, బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఈ అక్రమాల్లో పౌర సరఫరాల శాఖ అధికారుల పాత్ర ఉన్నట్లు విమర్శలు వస్తున్నాయి.

ఎలుకలు తినడంతోనే..

గోదాంలో బియ్యం ఏడెనిమిది నెలలుగా స్టాక్ ఉండగా ఎలుకలు తింటుండటంతో బస్తాలో తరుగు వస్తుంది. ఎలాంటి అక్రమాలు జరగడం లేదు. నేను ఈ దుమ్ముధూళిలో ఉంటూ పని చేస్తున్నారు. డీలర్లను తూకం వేసుకుని తీసుకెళ్లమంటే బస్తాలను కౌంటింగ్ చేసుకునే తీసుకెళ్తున్నారు. తర్వాత తరుగు వచ్చిందని ఆరోపిస్తున్నారు. అంగన్‌వాడీలకు, పాఠశాలలకు 2 లేక 3 కిలోల తరుగు రావడం వాస్తవమే. స్టేజీ–1 బియ్యం నేరుగా పంపుతున్నాం. డీలర్ల సంఘం అధ్యక్షుడిని అడిగితే అన్ని వివరాలు చెబుతారు. – దత్తురెడ్డి,గోదాం ఇన్‌చార్జి (డీటీ) పెద్దశంకరంపేట